క్లుప్తంగా

30లోపు ఈకేవైసీ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలని రేషన్ డీలర్లతో ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రేషన్ కార్డు డీలర్లు గ్రామాలలో రేషన్ కార్డుదారులతో సమావేశమై పెండింగ్ లేకుండా ప్రతి ఒక లబ్ధిదారుడికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పరామర్శ



శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

పుల్లంపేట : మండల పరిధిలోని ఉడుమువారి పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తురక శ్రీనివాసులు రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తురక శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, రిజ్వాన్, ఖదీర్, సయ్యద్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

నందలూరు : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. కడప – చెన్నై ప్రధాన రహదారిలోని బాహుదా నది వంతెన సమీపంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి



నాయకులను సన్మానిస్తున్న వీరనాగిరెడ్డి

వీరబల్లి : మండలానికి చెందిన గాలివీటి వీరనాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి, కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులను, మదనపల్లి వైఎస్సార్ పార్టీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డిని వీరనాగిరెడ్డి కలసి వారిని శాలువాలతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని వీరనాగిరెడ్డి తెలియజేశారు.

ప్రారంభమైన మహాకుంభాభిషేకం

రాజంపేట టౌన్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశ వర్ష సంపూర్ణ మహాకుంభాభిషేకం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలోని ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించారు. అలాగే సువర్చల సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ప్రముఖ వేదపండితులు టంగుటూరు రాజశేఖర్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు హరిస్వామి నేతృత్వంలో విశేష పూజలు జరిపించారు. రాత్రి ఉత్సవ మూర్తులకు ఊంజల్ సేవను నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బుధ, గురువారాల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రక్తదానం

రాయచోటి జగదాంబసెంటర్ : పీలేరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనూష అనే గర్భిణికి రక్తం అవసరం ఉండటంతో రక్తదానం చేయించినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ ఛైర్మన్ డా.సయ్యద్ మైనుద్దీన్ తెలిపారు. గర్భిణి బంధువులు తమను సంప్రదించడంతో నాగరాజు అనే యువకుని ద్వారా రక్తదానం చేయించామన్నారు. దీంతో గర్భిణి బంధువులు మైనుద్దీన్‌ను, సభ్యులను అభినందించారు.

కార్మికులను బానిసలుగా చేయడం తగదు

- లేబర్ కోడ్‌లను రద్దు చేసే దాక పోరాటం
- నిరసనలో కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : కార్మికులను బానిసలుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాదరాజు గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయం ఆవరణలో జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన గంగాధర్ మాట్లాడుతూ ఇప్పుడున్న పర్మినెంట్ ఉద్యోగాల వ్యవస్థ స్థానంలో ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో తాత్కాలిక ఉద్యోగుల వ్యవస్థను తీసుకువచ్చే పనిలో కేంద్రం ఉందని విమర్శించారు. మొత్తం నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం 2019 – 2020లో చట్టాలుగా చేసినప్పటికీ కార్మిక వర్గ ప్రతిఘటన వలన వీటిని అమలు చేసే తేది ప్రకటించకుండా పెండింగ్‌లో ఉంచారని, అయితే సొంత మెజార్టీ లేనప్పటికీ కొందరు మిత్రుల మద్దతుతో 2024లో మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృతంగా అమలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తే కార్మిక వర్గం ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ త్రివేణి సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాలు కూలిపోతాయ్

రాజంపేట రూరల్ : కార్మికులను నిర్లక్ష్యం చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలిపోతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ హెచ్చరించారు. స్థానిక ఆర్అండ్‌బీ వద్దనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి కొత్త చట్టాలను తీసుకొచ్చి కార్మిక యూనియన్‌లను లేకుండా చేసేందుకు ప్రయత్నం చేయటం తగదన్నారు. కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు అమలు చేసి వారి న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

కార్మిక, కర్షకుల నడ్డి విరిచే విధంగా కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఇ.సికిందర్ డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఎన్‌టీఆర్ సర్కిల్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

రాయచోటి టౌన్ : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ రాయచోటిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు తెలిపారు. మున్సిపల్, అంగన్‌వాడీ, విద్యుత్, వీఆర్‌ఏ, గ్రామ పంచాయితీ కార్మికులతో కలసి నిరసన చేపట్టినట్లు చెప్పారు. బ్రిటిష్ వారితో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాన్ని మోడీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వలన కార్పొరేట్‌లకు లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని వారుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ నల్లచట్టాలను తెచ్చి కార్పొరేట్ వ్యవసాయాన్ని వృద్ధి చేసి రైతులను నట్టేట ముంచేలా చేసేందుకు కేంద్రం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు.. తరువాత వచ్చిన కార్మిక చట్టాలు ఏవీ ఒకరి దయతో వచ్చినవి కావన్నారు. వేలాది మంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్నారని పేర్కొన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా మహిళా కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. జులై 09వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్, విద్యుత్ రంగాల వారు పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు అసంఘటిత కార్మికులు అందరూ సమ్మెను బలపరిచి ప్రధాని మోడీ కార్మిక, కర్షక వ్యతిరేఖ విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ కోశాధికారి రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపాల్, చెన్నయ్య, మంగమ్మచ శంకరయ్య, సుహాసిని, విజయమ్మ, పావని, మంజుల పీరమ్మ, ఇందిరమ్మ, కుమార్,రమణ, నరసింహులు, నాగరాజు, వెంకటరమణ, తదితరులుపాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దుచేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 8 గంటల పని వేళలను కాపాడాలని తెలిపారు. గతంలో ఉన్న కార్మిక చట్టాలను పటిష్టం చేయాలన్నారు. అలాగే కార్మికుల హక్కులను కాలరాయకుండా కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకుల నిరసన



రైల్వేకోడూరు అర్బన్: నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



రాజంపేట రూరల్: ఆర్అండ్‌బీ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకుల నిరసన



ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో ఏఐటీయూసీ నాయకుల నిరసన



రాజంపేట రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకుల నిరసన

రైతులకు జనుము విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ఎన్.శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె, సిద్దవటం గ్రామాల్లో మంగళవారం రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జనుములను పంపిణీ చేశారు. మాచుపల్లెలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, సిద్దవటం వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఓ రమేష్‌రెడ్డి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జనుము విత్తనాలు కావలసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. నమోదు చేసుకున్న రైతులు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లిస్తే సదరు విత్తనాలను వెంటనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్ల శ్రావణి(19), విఘ్నేశ్వరన్(21) ప్రేమ పెళ్లి చేసుకొని స్థానిక పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇద్దరు మేజర్లు కావడం, అమ్మాయి తాను ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నానని పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఇరువురు కుటుంబాలను పిలిపించి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

చల్లంగా చూడమ్మా.. గంగమ్మా

వీరబల్లి : మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీలోని షికారుపాలెం ప్రజలను చల్లగా చూడాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి గంగమ్మ తల్లిని వేడుకున్నారు. ఇటీవల షికారుపాలెంలో నూతనంగా గంగమ్మ ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 41 రోజులు పూర్తి కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజామున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీబడ్లు కట్టి అమ్మవారు గుడి చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. యువత సాంస్కృతిక కార్యక్రమాలు తప్పెట్లు, తాళాలతో వేడుక జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్నా ఎమ్మెల్యే ఆకేపాటికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, పెద్దివీడు సర్పంచ్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, సుండుపల్లి మండలం గొల్లపల్లి సర్పంచ్ రామజయచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ జాతర

సుండుపల్లె : ప్రజలందరికీ సిరిసంపదలు కల్పించి, సుఖసంతోషాలను ప్రసాదించాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి మారెమ్మ తల్లిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మండల పరిధిలోని వానరాచపల్లె ఎగువబిడికి గ్రామంలో వెలసిన మారెమ్మ తిరునాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ మండల నాయకులు కార్యకర్తలతో కలిసి మండలంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలలో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ ఎస్టీ గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రనాయక్, మాజీ ఎంపీపీ అజంతమ్మ, మోహన్‌రెడ్డి, బాబురెడ్డి, రఘు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రసాదం అందజేత

రాజంపేట రూరల్ : ఇటీవల భువనగిరి కొండపై అత్యంత వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరిగాయి. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌కు దేవస్థాన కమిటి ప్రతినిధులు మంగళవారం విచ్చేశారు. ముందుగా కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను ఆకేపాటికి కమిటీ ప్రతినిధులు అందజేశారు.



వీరబల్లి: బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

సీహెచ్‌ఓలపై ప్రభుత్వం కక్షసాధింపు

రాయచోటి : న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని అన్నమయ్య జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓ) హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 23వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కానీ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పట్టించుకోకపోవడం దారుణమని యూనియన్ నేతలు ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారమయ్యే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని వారు వెల్లడించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న తమపై ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, వేతనం పెంపు, ఈపీఎఫ్ పునరుద్ధరణ, ఆధారిత ప్రోత్సాహాలు, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లు తీర్చకపోతే త్వరలో ఆందోళన మరింత ఉధృతం చేయడానికి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని వారు తెలిపారు.



శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

స్తంభించిన వైద్య సేవలు

జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 23 రోజులుగా సమ్మె చేస్తుండటంతో ప్రజలకు వైద్య సేవలు స్తంభించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు వైద్య సేవలు స్తంభించడంతో పేద ప్రజలు కార్పొరేట్ వైద్యానికి వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దారుణమని గ్రామీణ ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ రోగులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లడం అక్కడ వైద్య సిబ్బంది లేకపోవడంతో వెను తిరుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమ్మెను విరమింపజేసి పేద ప్రజలకు వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమ్మెలో జిల్లా ఏపీఎంసీఏ నాయకులు సాల్మన్, అహ్మద్, బాషా, శివకుమార్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సైనిక శౌర్యాన్ని ప్రపంచానికి చాటాం

రాజంపేట టౌన్ : ఆపరేషన్ సింధూర్‌లో సైనికుల ప్రదర్శించిన శౌర్యాన్ని కీర్తిస్తూ మంగళవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పట్టణంలో వంద అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి పాత బస్టాండు వరకు సాగింది. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు జాతీయ జెండాలను చేతబూని జై జవాన్, జై కిసాన్, మేరా భారత్ మహాన్, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ నినాదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు మన సైనికులు ప్రాణాలను ఒడ్డి తగిన బుద్ధి చెప్పారన్నారు. పాకిస్తాన్ భారత్‌ను తక్కువ అంచనా వేసి భారీ మూల్యం చెల్లించుకుందని పేర్కొన్నారు. ఉగ్రవాదులు మనవారిని పొట్టన పెట్టుకున్న ప్రతిసారి పాకిస్తాన్‌కు బుద్ధి చెబుతున్నా, పాక్ తన వంకర బుద్ధి మాత్రం పోగొట్టుకోలేదని దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో దేశం ఎదుగుతుండటాన్ని పాకిస్తాన్ జీర్ణించుకోలేక ఉగ్రవాదులతో మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్రలు పన్నుతోందన్నారు. దేశ అభివృద్ధికి ఉగ్రవాదం పెనుముప్పు లాంటిదన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమన్నారు. అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించే భారతీయుల మధ్య ఉగ్రమూకలు చిచ్చుపెట్టేందుకు వెనకాడటం లేదన్నారు. అందువల్ల ప్రతి భారతీయుడు ఎప్పటిలాగే అన్నదమ్ముల బంధాన్ని విడనాడకుండా అవసరమైతే ఉగ్రవాదులను కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రతి భారతీయుడు సైనికుడు కావాలన్నారు.



రాజంపేట పట్టణంలో సైనికులకు సంఘీభావంగా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా కమిషనర్ కె.విజయరామరాజును విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:45గా తీసుకోవాలని కోరారు. అయితే దీనిపై కమిషనర్ 1:49 మందిగా తీసుకొనే అవకాశం ఉన్నట్లుగా తెలిపారు. ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సిలింగ్ కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని కోరగా మండలానికి ఒకటి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లుగా చెప్పారన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో బాషా పండితులను కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌తో ఉపాధ్యాయ సంఘాల చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొనిగల హైమారావు, కడప జిల్లా అధ్యక్షులు ఏబీ రామకృష్ణమ రాజులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యా కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

పూరిగుడిసెలు లేకుండా చూడాలి

చిట్వేలి : గ్రామాలలో పూరి గుడిసెలు లేకుండా అన్ని పక్కా గృహాలు ఉండేలాగా చూడాలని డీఈ మురళీ కృష్ణ మండల ఏఈ సుధాకర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఏఈ సుధాకర్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చిట్వేలి మండల పరిధిలో మైలపల్లి పంచాయతీలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉండగా 20 కుటుంబాలు పూరిగుడిసెల్లో నివసిస్తున్నారని, వారికి పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. ఎక్కడా పూరిగుడిసెలు లేకుండా పూర్తిగా పక్కా గృహాలు మంజూరు చేయాలని డివిజనల్ అధికారి మురళీకృష్ణ ఆదేశించారని ఏఈ సుధాకర్ తెలియజేశారు.



ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీఈ, ఏఈలు

ఉపాధి కూలీల బిల్లులు చెల్లించాలి

పుల్లంపేట : పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే చెల్లించాలని హిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దళవాయిపల్లి పంచాయతీ కేతరాజుపల్లి గ్రామాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పనిలో పనిచేస్తున్న కార్మికులు మహిళలందరికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని, ప్రతి కార్మికునికి జాబ్ కార్డుతో సంబంధం లేకుండా 200 రోజులు పనిదినాలు ప్రభుత్వం కల్పించాలన్నారు. ఆమె వెంట ఓబులమ్మ, వసుంధర, లక్ష్మీదేవి, రాములమ్మ ఉన్నారు.



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సరోజనమ్మ

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దుకాణదారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికల కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వరల్డ్ మెట్రాలజీ డే సందర్భంగా నగరంలోని తూనికల కొలతల శాఖ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ చట్టం, నిబంధనల గురించి వివరించారు. దుకాణాదారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. తూనికలలో అవకతవకలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో తూనికల కొలతలు ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది, పెట్రోల్ పంపు, డీలర్, కిరాణా, ఐరన్ అండ్ స్టీల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.